## బాధ్యతలు స్వీకరణ

మహబూబ్‌నగర్, డిసెంబర్ 16 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరేంద్ర ప్రతాప్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌తోపాటు మున్సిపల్, వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ వీరేంద్ర ప్రతాప్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌కమిషనర్ ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

### మూడు రోజులపాటు
## మిషన్ భగీరథ నీళ్లు బంద్

◆ ఏఈ అనిల్‌కుమార్ రెడ్డి

మహ్మదాబాద్, డిసెంబర్ 16 : మహ్మదాబాద్ మండలంలోని అన్ని గ్రామాలకు మూడు రోజులపాటు మిషన్ భగీరథ నీళ్లు రావంటు మిషన్ భగీరథ ఏఈ అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. చించోళి, మహబూబ్‌నగర్ నాలుగు లైన్ల రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పనులు జరుగుతుండడంతో నీళ్లు రావని శనివారం ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాగానే గ్రామాలకు మంచి నీటి సరఫరా చేస్తామని, మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## రేపు సర్వసభ్య సమావేశం

గండీడ్, డిసెంబర్ 16 : ఈనెల 18వ తేదీన ఎంపీపీ మాధవి అధ్యక్షతన ఉమ్మడి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రూపేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు గండీడ్ మండల కేంద్రంలో మండల అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఉమ్మడి మండలం నుంచి అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖ ల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

## మండల సమావేశం వాయిదా

మూసాపేట, డిసెంబర్ 16 : మూసాపేట మండల సర్వసభ్య సమావేశం శనివారం వాయిదా పడింది. సమావేశానికి ఎంపీపీ గూపని కళావతితో పాటు జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ అధికారులు, సర్పంచులు, సిబ్బంది హాజరు అయ్యాయి. కాగా సమయం ముగిసినా మిగితా సభ్యులు ఎవరు రాకపోవడంతో కోరం లేదని వాయిదా వేసినట్లు ఎంపీపీ కళావతి, ఎంపీడీవో స్వరూప తెలిపారు.

## తల్లిదండ్రులు సహకరించాలి

భూత్పూర్, డిసెంబర్ 16 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ఏఎంవో శ్రీనివాస్ కోరారు. శనివారం పట్టణ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు యాదయ్య అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంవో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లవాడు పాఠశాలకు సరిగ్గానే వెళ్తున్నాడా? లేదా? అని పరిశీలించాలి, ఇంట్లో చదువుకుంటున్నాడా? లేదా? విషయాలను పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడితో చర్చించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వృద్ధురాలు అదృశ్యం

కొత్తకోట, డిసెంబర్ 16 : కొత్తకోట పట్టణంలోని దండుగడ్డ కాలనీకి చెందిన చెలిమిల్ల రాంచంద్రమ్మ(70) వృద్ధురాలు తప్పిపోయినట్లు ఏఎస్సై సాగర్ తెలిపారు. ఏఎస్సై కథనం మేరకు ఈనెల 6వ తేదీ నుంచి రాంచంద్రమ్మ తన పెద్ద కుమారుడు శివారెడ్డి ఇంట్లో ఉంటుంది. శివారెడ్డి సోదరుడు చుక్కారెడ్డి తమ సమీప బంధువుల పెండ్లికి వెళ్లి 7వ తేదీన ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చే సమయానికి తన తల్లి కనిపించలేదు. చుట్టూ పక్కన సమీప బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. చుక్కారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రజలకు క్షయ వ్యాధి పరీక్షలు

గండీడ్, డిసెంబర్ 16 : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన టీబీ వైద్య శిబిరంలో ఉమ్మడి గండీడ్ మండలం నుంచి 366 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి రఫీక్, చంద్రశేఖర్, వైద్యసిబ్బంది ఉన్నారు.

# విద్యార్థులకు గుణాత్మక విద్య అందాలి

◆ కలెక్టర్ రవినాయక్



దేవరకద్రరూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

దేవరకద్రరూరల్(చిన్న చింతకుంట), డిసెంబర్ 16 : పాఠశాల విద్యార్థులకు ఫలితాల కన్నా, గుణాత్మక విద్యను అందించడమే లక్ష్యమని కలెక్టర్ రవినాయక్ పేర్కొన్నారు. శనివారం చిన్నచింతకుంట మండలం లాల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతిలో చదివిన అంశాలే భవిష్యత్తులో చాలా ఉపయోగపడుతాయన్నారు. ఉన్నత స్థానాలకు ఎదగాలంటే ప్రణాళికా బద్ధంగా చదవాలని సూచించారు. చదువులకు పేదరికం అడ్డుకాదని, నేను కూడా మారుమూల తండాలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించినట్లు తెలిపారు. కష్టపడి చదువుకొని ఉత్తీర్ణతను సాధించాలని సూచించారు. ఈ ఏడాది పదో తరగతిలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ లక్ష్మణ్ పలు సూచనలు చేసి విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఎంఈవో లక్ష్మణ్‌సింగ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్

మహబూబ్‌నగర్, డిసెంబర్ 16 : తెలంగాణలో విధులు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని నూతనంగా విచ్చేసిన అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ రవినాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి నాయక్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగత శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఉన్నవ్ జిల్లాకు చెందిన వాడినని తెలిపారు. 2021 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా కామారెడ్డిలో మొదట శిక్షణ పొందానని, రెండు సంవత్సరాల శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఇటీవల ముస్సోరీలో శిక్షణ పూర్తి చేసుకుని వచ్చానన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పోస్టింగ్ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న జిల్లా జడ్జి

## కురుమూర్తి స్వామిని దర్శించుకున్న జడ్జి

దేవరకద్రరూరల్(చిన్న చింతకుంట), డిసెంబర్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి పాపిరెడ్డి దంపతులు చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి స్వామిని శనివారం దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని సాదరంగా ఆహ్వానించి స్వామివారికి పూజలు చేయించారు. అనంతరం వారి గోత్రనామాలతో ఆశీర్వదించి, శాలువాతో సన్మానించారు.

## కొనసాగుతున్న పీయూ యూజీ పరీక్షలు

పాలమూరు, డిసెంబర్ 16 : పాలమూరు యూనివర్సిటీ పరిధిలో శనివారం 5వ సెమిస్టర్ డిగ్రీ యూజీ పరీక్షలో 10,936 మంది విద్యార్థులకు 10,540 మంది విద్యార్థులు హాజరుకాగా 384మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకటో సెమిస్టర్ పరీక్షకు 11,692 మంది విద్యార్థులకు గానూ 10,445 మంది హాజరుకాగా 1,243 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో జడ్చర్ల డాక్టర్ బీఆర్‌ఆర్ అంబేద్కర్ డిగ్రీ కళాశాలలో 5, ప్రగతి డిగ్రీ కళాశాల అచ్చంపేట్4, చైతన్య డిగ్రీ కళాశాల అచ్చంపేటలో 3, స్ఫూర్తి డిగ్రీ కళాశాల నారాయణపేటలో 2, ఎంఏఎల్‌డీ గద్వాలలో 1, ఎస్‌వీఎంఆర్ వనపర్తి 1 చూచిరాత కేసులు నమోదు అయ్యాయని పీయూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శాంతిప్రియ తెలిపారు.

## ఘనంగా విజయ్ దివస్ వేడుకలు

పాలమూరు, డిసెంబర్ 16 : స్థానిక ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం విజయ్‌దివస్ పురస్కరించుకొని కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్, ఎన్‌సీసీ ఏఎన్‌వో లెఫ్టినెంట్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ అమీన్‌ముంతాజ్, సురయ్యాజబీన్, రవళి, లక్ష్మీనరింహ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

దేవరకద్ర, డిసెంబర్ 16 : మండలంలోని తపోవన్ ఉన్నత పాఠశాలల్లో శనివారం పాఠశాల విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. కలెక్టర్‌గా పల్లవి, అదనపు కలెక్టర్‌గా వినయ్, డీఈవోగా సంతోష్, ఎంఈవోగా అజయ్, ప్రిన్సిపాల్‌గా సంధ్యతోపాటు 50 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

మహ్మదాబాద్, డిసెంబర్ 16 : బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్‌పీ వెంకట్ కోరారు. శనివారం మండల పరిధిలోని చిన్నాయిపల్లిలో బడి మాని ఇంటి వద్ద చంటి పిల్లలను చూసుకుంటున్న ఓ విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడి చిన్నారిని బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బడిబయటి పిల్లలు ఉన్నారని వారిని పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

◆ జిల్లా విద్యాధికారి రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రవీందర్

మూసాపేట(అడ్డాకుల), డిసెంబర్ 16 : ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ అన్నారు. మండలంలోని కందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలగాలని, విద్యలో ఉన్నత శిఖరాలను అధిగమించాలంటే విద్యార్థులకు క్రమశిక్షణనే ప్రధానం అని చెప్పారు. పట్టుదలతో చదవి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అంతకుముందు సర్పంచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ 10వ తరగతిలో 9.5 జీపీఏ సాధించిన ప్రతి విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. అందుకు డీఈవో మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు సర్పంచ్ శ్రీకాంత్ నగదు బహుమ తి ప్రకటించడంతో విద్యార్థుల్లో కూడా పోటీత త్వం పెరిగి కష్టపడి చదువుతారన్నారు. 100 శాతం ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు కూడా దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంవో బాలు యాదవ్, ప్రధానోపాధ్యాయుడు కురుమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 17 నుంచి
## ధనుర్మాస వ్రత మహోత్సవాలు

పాలమూరు, డిసెంబర్ 16 : జిల్లా కేంద్రంలోని సింహగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి 2024 జనవరి 14 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త చంద్రమౌళి తెలిపారు. అదే విధంగా ఈనెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వారం నుంచి దర్శనం ఉంటుందని తెలిపారు. జవవరి 1వ తేదీన నూతన సంవత్సరం సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ, పూజలు, గరుడవాహన సేవలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జనవరి 14వ తేదీన గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో స్వామి వారిని దర్శించుకొని అష్టైశ్వర్య, ఆయురారోగ్యాలు పొందాలని ఆయన కోరారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

◆ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పందుల తరలింపు ◆ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి

జడ్చర్లటౌన్, డిసెంబర్ 16 : మున్సిపాలిటీలో అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నాయని మున్సిపల్ పాలకమండలిపై వస్తున్న ఆరోపణల్లో ఎటువంటి నిజంలేదని జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి అన్నారు. స్థానిక కావేరమ్మపేట మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లతో కలిసి ఆమె మాట్లాడారు. జడ్చర్ల మున్సిపాలిటీగా ఏర్పడిన తరుణంలో మొట్టమొదటగా ఎన్నికైన పాలకవర్గం సభ్యులందరం కలిసి మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి సహకారంతో మున్సిపాలిటీ పరిధిలో అనేక అభివృద్ధి పనులతో పాటు ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పారదర్శకంగా పనులు జరుగుతున్నాయన్నారు. దళారుల ప్రమేయం లేకుండా ఇంటినిర్మాణ అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి ప్రత్యేక అధికారుల కమిటీ పర్యవేక్షణలో ఇంటి నిర్మాణాలకు అనుమతులు లభిస్తున్నాయన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అవకతవకలు జరుగుతున్నాయని కొందరు అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంచర్లలో 10శాతం ప్రభుత్వ స్థలాలను గుర్తించి బోర్డులను ఏర్పాటు చేసి పరిరక్షిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలో పందుల బెడదతో డెంగీ, మలేరియా వంటి రోగాలు వచ్చేందుకు అవకాశాలున్నాయని ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పందులను తరలించేందుకు పాలకవర్గం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. అలాగే పంటపొలాలను పందులు నాశనంచేస్తున్నాయని రైతులు ఫిర్యాదులు చేశారన్నారు. ఈ క్రమంలోనే పందులను ఇక్కడి నుంచి తరలించాలని పందుల పెంపకందారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదని, తద్వారా పందుల పెంపకందారుల సమక్షంలోనే పోలీసు అధికారుల సహకారంతో పందులను ఇతర ప్రాంతాలకు తరలించామని చెప్పారు. పందులను అమ్ముకున్నట్లు కేవలం ఆరోపణలు మాత్రమేనని, ఈ విషయంలో పాలకమండలికి సంబంధంలేదని చెప్పారు. ఎవరైనా పందులను అమ్ముకున్నట్లు ఏమైనా ఆధారాలు చూయిస్తే బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, రఘురాంగౌడ్, నందకిశోర్‌గౌడ్, లత, జ్యోతి, శ్రావణి, చైతన్యగౌడ్, రమేశ్, చైతన్య చౌహాన్, సతీశ్, శ్రీశైలమ్మ, కోనేటిపుష్పలత, మహేశ్, ఉమాశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.